



నేడు మునిసిపల్ వైస్ చైర్మన్‌పై
అవిశ్వాసం

కలెక్టర్‌కు మునిసిపల్ వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస తీర్మాణ నోటీసును అందజేస్తున్న కౌన్సిలర్లు (ఫైల్)

- మధ్యాహ్నం 3 గంటలకు ప్రత్యేక సమావేశం
- వీగుతుందా.. నెగ్గుతుందా అంటూ చర్చ
- మానుకోట జిల్లా కేంద్రంలో ఉత్కంఠ

మహబూబాబాద్ టౌన్, మార్చి 3 : మానుకోట మునిసిపల్ బీఆర్ఎస్ వైస్ చైర్మన్ ఫరీద్‌పై అవిశ్వాస ప్రకటన తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. దీనిపై సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక మునిసిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత అధికార మార్పిడితో అనేక చోట్ల మునిసిపాలిటీల్లో అవిశ్వాస తీర్మాణాలు పెట్టారు. కొన్నిచోట్ల నెగ్గగా, మరి కొన్నిచోట్ల మెజార్టీ సభ్యులు సమావేశాలకు హాజరు కాకపోవడంతో కోరంలేక వీగిపోయాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 36 వార్డులతో అతిపెద్ద మానుకోట మునిసి పాలిటీ బీఆర్ఎస్ వైస్ చైర్మన్ ఫరీద్‌పై కౌన్సిలర్లు ఫిబ్రవరి 12న అవిశ్వాసం పెట్టారు. మునిసిపాలిటీలో మొత్తం 36 మంది కౌన్సిలర్లు ఉండగా అందులో ఒక్కరు చనిపోగా, మిగిలిన 35 మందిలో ఆరుగురు మినహా 29మంది కౌన్సిలర్లు సంతకాలు చేసిన ప్రతిని (నోటీస్)ను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు అందజేశారు. ఈ క్రమంలో వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసంపై నేడు మునిసిపల్ కౌన్సిలర్ల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

నాలుగేళ్ల తర్వాత అవిశ్వాసం..

మహబూబాబాద్ మునిసిపాలిటీకి జనవరి 2020 సంవత్సరంలో ఎన్నికలు జరగ్గా అప్పట్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోగా చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులు బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. మునిసిపాలిటీలో మొత్తం 36 మంది వార్డు కౌన్సిలర్లకుగాను ఒక్కరు చనిపోగా,35మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఇందులో ప్రస్తుతం బీఆర్ఎస్‌కు 22 మంది, కాంగ్రెస్‌కు 9 మంది, సీపీఐకి ఇద్దరు, సీపీఎంకు ఇద్దరు వార్డు కౌన్సిలర్లు ఉన్నారు. సీపీఐ ఇద్దరు కౌన్సిలర్లు, బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు, కాంగ్రెస్‌కు చెందిన వార్డు కౌన్సిలర్ వెరసి ఆరుగురు మినహా మిగతా 29 మంది అవిశ్వాస తీర్మాణంపై సంతకాలు చేశారు. సంతకాలు చేసినవారిలో బీఆర్ఎస్‌కు చెందిన 19మంది కాంగ్రెస్‌కు చెందిన 8 మంది, సీపీఎంకు చెందిన ఇద్దరు కౌన్సిలర్లు ఉన్నారు. ఇక సీపీఐ పార్టీ మాత్రం అవిశ్వాసంపై తమ నిర్ణయాన్ని వెల్లడించలేదు. అవి శ్వాసంలో పాల్గొంటారా.. లేక దూరంగా ఉంటారా అని నేడు తేలనుంది.

మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలో వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసంపై ఉత్కంఠ నెలకొంది. ఈనెల 4న అవిశ్వాసంలో కౌన్సిలర్లంతా పాల్గొని అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేస్తారా! లేదా? అనే చర్చ ప్రజల్లో జరుగుతోంది. పట్టణంలో అవిశ్వాస చర్చ హాట్ టాపిక్‌గా మారింది. అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్లలో ఇప్పటికే 23 మంది ప్రత్యేక శిబిరంలో ఉన్నట్లు తెలుస్తోంది. వీరితో పాటు మద్దతునిచ్చే కౌన్సిలర్లతో కలిసి మునిసిపాలిటీలో జరిగే సమావేశానికి హాజరు కానున్నట్లు తెలుస్తోంది. మునిసిపాలిటీలో 35 మంది కౌన్సిలర్‌లుండగా ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, ఎంపీ కవిత ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఉన్నారు. దీంతో మొత్తంగా 38 మంది కాగా అందులో 2/3 వంతు సభ్యులు అంటే 26 మంది హాజరు కావాల్సి ఉం టుంది. కాగా, కౌన్సిలర్లు తనకు వ్యతిరేకంగా ఓటు వేయరని భావిస్తున్నానని వైస్ చైర్మన్ ఫరీద్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికి మునిసిపల్ వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గుతుందా, లేదా వీగిపోతుందా అనే ఉత్కంఠతకు సోమవారంతో తెరపడనుంది.



అరూరి రమేష్



గులాబీకి ఝలక్!

బీజేపీలోకి మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్

వరంగల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గులాబీ పార్టీకి నేతలు ఝలక్ ఇస్తున్నారు. ఒక్కొక్కరుగా కారు దిగి ఎవరి దారి వారు చూసుకుంటున్నారు. ఇటీవల మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య పార్టీని వీడగా, తాజాగా వరంగల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ గులాబీ పార్టీకి గుడ్‌బై చెప్పేందుకు సిద్ధమయ్యారు. బీజేపీలో చేరేందుకు రమేష్ రంగం సిద్ధం చేసుకున్నారు. మరో వైపు వరంగల్ నగర మేయర్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు సైతం బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి చేరేందుకు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. అలాగే వర్ధన్నపేట మునిసిపల్ చైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్లు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో హస్తం గూటికి చేరగా, డీసీసీబీ చైర్మన్ మార్నేని సైతం పార్టీ మారేందుకు సిద్ధపడుతున్నట్లుగా సమాచారం. ఒక్కొక్కరు కారు దిగుతుండటంతో గులాబీ పార్టీకి భారీ షాక్‌గా మారుతుంది. వివరాల్లోకి వెళితే...

ఓటమితో గులాబీ డీలా...

గత అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ పార్టీ భారీ ఓటమితో డీలా పడింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ములుగు, భూపాలపల్లి మినహా 10 చోట్ల గులాబీ పార్టీ విజయం సాధించింది. ఆ తరువాత మూడు నెలలకే భూపాలపల్లి ఎమ్మెల్యే హస్తం పార్టీ వీడి గులాబీ కారు ఎక్కారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్‌కు ఎదురులేకుండా రాజకీయాలు నడిచాయి. అయితే 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతో సహా కీలక నేతలు ఓటమి పాలవ్వడంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కేవలం జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. దీంతో గులాబీ క్యాడర్ డీలా పడింది. పైగా 2028లో నియోజకవర్గాల పునర్విభజన జరగనుంది. ఈ నేపథ్యంలో అప్పటి వరకు ఏ నియోజకవర్గం ఏ రిజర్వుడు కోటాలోకి వెళుతుందో అనే ఆందోళనతో ఉన్న నేతలు దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్క పెట్టుకోవాలనే ఆలోచనతో పక్క పార్టీల వైపు చూస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే బీఆర్ఎస్‌లో అసమ్మతి గళం విప్పిన మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య పార్టీకి రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఒక్కొక్కరు గులాబీ పార్టీని వీడేందుకు సిద్ధమవుతుండటం గులాబీ శ్రేణుల్లో ఆందోళనకు గురి చేస్తోంది.

గులాబీ పార్టీకి అరూరి గుడ్‌బై..?

గులాబీ పార్టీకి మరో భారీ షాక్ తగలనుంది. బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ పార్టీని వీడేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ స్థానం నుంచి పోటీ చేయాలనే ఆలోచనతో ఉన్న అరూరికి గులాబీ అధిష్ఠానం నుంచి సానుకూలత రాలేదు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె కడియం కావ్యను వరంగల్ ఎంపీ బరిలో దించేందుకు బీఆర్ఎస్‌లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో బీజేపీ నుంచి పోటీ చేయాల్సిందిగా ఆ పార్టీ నుంచి అరూరి రమేష్‌కు ఆఫర్ వచ్చింది. దీంతో తన అనుచర వర్గంతో గత రెండు రోజులుగా చర్చలు జరిపారు. బీజేపీ జాతీయ నేతల నుంచే ఆహ్వానం రావడంతో బీజేపీలో చేరి వరంగల్ ఎంపీగా పోటీ చేయాలని నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి విజయం సాధించిన అరూరి రమేష్ 2023 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ స్థానం నుంచి బీఆర్ఎస్ పోటీకి అవకాశం లేకపోవటంతో బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారనే టాక్ వినిపిస్తోంది. ఆర్థికంగా బలంగా ఉన్న అరూరి రమేష్‌కు వర్ధన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్, వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో వ్యక్తిగత పరిచయాలు ఉన్నాయి. దీంతో పాటు బలమైన మాదిగ సామాజిక వర్గం నేత కావడంతో అరూరి రమేష్‌ను బరిలో దించితే గెలిచే అవకాశాలు ఉంటాయని బీజేపీ కూడా అంచనా వేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో గత నెల రోజులుగా బీజేపీ రాష్ట్ర, జాతీయ నాయకత్వం నుంచి వస్తున్న ఆహ్వానంతో పార్టీ మారేందుకు అరూరి నిర్ణయం తీసుకున్నట్లుగా సమాచారం.

- వరంగల్ ఎంపీగా బరిలో దిగుతారని ప్రచారం
- త్వరలో ప్రధాని మోదీ సమక్షంలో చేరిక
- మరో మాజీ ఎంపీ చూపు కమలం వైపు
- మహబూబాబాద్ టికెట్ కోసం చర్చలు
- వరంగల్ మేయర్‌తో సహా పలువురు కార్పొరేటర్లు హస్తం గూటికి..
- సీఎం సమక్షంలో చేరేందుకు ఏర్పాట్లు
- కాంగ్రెస్‌లో చేరిన వర్ధన్నపేట మునిసిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్
- కండువా కప్పి ఆహ్వానించిన సీఎం రేవంత్‌రెడ్డి
- డీసీసీబీ అధ్యక్షుడు మార్నేని రవీందర్‌రావు చూపు హస్తం వైపు



సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మేయర్ గుండు సుధారాణి

కాగా, రమేష్ పార్టీ మారేందుకు నిర్ణయం తీసుకున్నట్లు జరుగుతున్న ప్రచారంతో బీఆర్ఎస్ అగ్ర నేతలు అలర్ట్ అయ్యారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావులు అరూరితో ఫోన్‌లో సంప్రదింపులు చేసినట్లుగా తెలిసింది. అయితే పార్టీ మారాలని నిర్ణయం తీసుకున్నానని, ఇన్ని రోజులు పార్టీలో సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపినట్లుగా సమాచారం. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య సైతం నేరుగా రమేష్ నివాసానికి వెళ్లి పార్టీ తరపున బుజ్జగించే ప్రయత్నం చేసినప్పటికీ అరూరి పార్టీ మారేందుకే ఫిక్స్ అయినట్లుగా తేల్చి చెప్పినట్లుగా సమాచారం. సోమవారం ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో పార్టీలో చేరటం లేదంటే మరో రోజు ఢిల్లీకి వెళ్లి పార్టీలో చేరడం జరుగుతుందని అరూరి సన్నిహితులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. మొత్తానికి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా, రెండు పర్యాయాలు వర్ధన్నపేట ఎమ్మెల్యేగా పనిచేసిన అరూరి రమేష్ పార్టీని వీడేందుకు

మిగతా 5వ పేజీలో..

కమలం వైపు మాజీ ఎంపీ చూపు..?

బీఆర్ఎస్‌కు మరో షాక్ తగిలేలా ఉంది. మహబూబాబాద్ పార్లమెంట్ సీటు కోసం ప్రయత్నాలు చేస్తున్న ఓ మాజీ ఎంపీ సైతం పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నట్లుగా సమాచారం. మహబూబాబాద్ సిట్టింగ్ ఎంపీ మాలోతు కవిత మరోసారి పోటీకి ఆసక్తి చూపుతున్నారు. అయితే ఖమ్మం జిల్లా వైరా మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ తన కుమారుడి కోసం మహబూబాబాద్ టికెట్ కేటాయించాలని బీఆర్ఎస్ అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లుగా సమాచారం. అయితే తనకు ఈసారి కూడా బీఆర్ఎస్ టికెట్ ఇవ్వడం కష్టమేననే నారాజ్‌లో ఉన్న ఓ మాజీ ఎంపీకి బీజేపీ నేతల నుంచి పోటీ చేసేందుకు పార్టీలో చేరాలని ఆహ్వానం అందినట్లుగా ప్రచారం జరుగుతోంది. అనుచరుల ఒత్తిడి మేరకు బీజేపీలో చేరేందుకు ఆ మాజీ ఎంపీ కూడా సిద్ధమవుతున్నట్లుగా తెలిసింది.

ప్రశాంతంగా బీసీ గురుకులం ప్రవేశ పరీక్ష



1,749 మంది విద్యార్థులు హాజరు

మహబూబాబాద్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల కోలాహలం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 3 : జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మహాత్మాజ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 6,7,8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగాజరిగినట్లు జిల్లా కోఆర్డినేటర్ అనిత తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్నసీట్ల భర్తీకి 1,972 మంది దరఖాస్తు చేసుకోగా, 8 సెంటర్లను ఏర్పాటు చేసి ఎగ్జామ్ నిర్వహించినట్లు తెలిపారు. 1,972 మందికి గాను 1,749 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. ఇందులో బాలురు 1,168 కి గాను 1,028 హాజరు కాగా, బాలికలు 804 మందికి గాను 721 మంది పరీక్ష రాసినట్లు వివరిం చారు. కాగా, పరీక్ష కేంద్రాలను డీఈవో రామారావు, ఏసీజీఈ మందుల శ్రీరాములు సందర్శించినట్లు అనిత తెలిపారు.

ఇక్కడంతా వైవిధ్యమే..



కురవి వీరభద్రస్వామి దేవాలయం

- కురవి వీరభద్రుడికి నారికేళాలు..
- భద్రకాళి అమ్మవారికి జంతు బలులు
- వీరన్న దేవాలయంలో అరుదైన సంప్రదాయం
- శివరాత్రి నుంచి నెలరోజుల పాటు జనజాతర
- మేడారం తర్వాత భారీగా గిరిజన భక్తుల దర్శనాలు
- ఉమ్మడి రాష్ట్రం నుంచి సీఎంల మొక్కులు, దర్శనాలు

5

పల్స్ పోలియో విజయవంతం

- జిల్లా కేంద్రంలో కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్
- మానుకోటలో కలెక్టర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ...
- మరిపెడలో ప్రభుత్వ విప్, తొర్రూరులో ఎమ్మెల్యే



కురవి వీరభద్రస్వామి దేవాలయంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్



మహబూబాబాద్‌లో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

నెహ్రూసెంటర్, మార్చి 3 : పోలియో రహిత సమాజమే లక్ష్యంగా 5 సంవత్సరాల్లోపు పిల్లలందరికి పల్స్‌పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని గుమ్ముడూరు ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం ఆయన చిన్నారులకు పోలియోచుక్కలు వేసి, పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు సంవత్సరాల్లోపు పిల్లందరికి పోలియో చుక్కలు వేయించాలని తద్వారా అంగవైకల్యం రాకుండా కాపాడవచ్చని పేర్కొన్నారు. కాగా, జిల్లాలోని 21 పీహెచ్‌సీల పరిధిలోని 18 మండలాలు 461 గ్రామాల్లోని 174 హెల్త్ సెంటర్లలో 459 పల్స్‌పోలియో బూత్ సెంటర్లను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 67 వేల మంది పిల్లలకు గాను సుమారు 62 వేల మందికి పోలియోచుక్కలు వేసినట్లు డీఎంఅండ్‌హెచ్‌వో అంబరీష తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి విజయ్‌కుమార్, కృష్ణార్జున్‌రావు, వడ్డెబోయిన శ్రీనివాస్, శ్రీకాంత్, రాజు, గీత, రుక్మోద్దీన్, కిరణ్మాయి, విజయకుమారి పాల్గొన్నారు.

- జిల్లా ఆస్పత్రిలో స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు చిన్నారులకు పోలియోచుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ.. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరికి పోలియోచుక్కలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో అంబరీష, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, విజయ్‌కుమార్, సుధీర్‌రెడ్డి, పురుషోత్తం, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.
- మహబూబాబాద్ మండలం రేగడితండా ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు ఎంపీటీసీ బద్రిచంద్రు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

చిన్నగూడూరు మండల కేంద్రంతో పాటు జయ్యారం, విస్సంపల్లి, ఉగ్గంపల్లి, గుండం రాజుపల్లిలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ పద్మా వెంకట్‌రెడ్డి, జడ్పీటీసీ మూల సునిత మురళీధర్‌రెడ్డి, ఎంపీడీవో రామారావు, పిల్లి వీరన్న, డాక్టర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

- మరిపెడ మండలం తండా ధర్మారంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుగులోతు అరుణరాంబాబు, లక్‌పతినాయక్ పాల్గొన్నారు.
- మరిపెడ మునిసిపల్ కేంద్రంలో చైర్‌పర్సన్ గుగులోతు సింధూర కుమారి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవినాయక్ పాల్గొన్నారు.



తొర్రూరులో చిన్నారికి పోలియోచుక్కలు వేస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

- దంతాలపల్లి మండల కేంద్రంలో ఎంపీపీ ఉమా, ఎంపీటీసీ యాకయ్య, వైద్యాధికారి చైతన్య సీహెచ్‌వో బాలాజీ నాయక్ పాల్గొన్నారు.
- పెద్దవంగర మండలం చిట్యాల గ్రామంలో ఎంపీపీ ఈదూరు రాజేశ్వరీ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.
- తొర్రూరు మండలం ఫత్తేపురంలో తహసీల్దార్ వినోద్ కుమార్, చర్లపాలెంలో ప్రత్యేకాధికారి బుచ్చయ్య, గుర్తూర్‌లో ఎంపీటీసీ మాధవి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.
- తొర్రూరు మునిసిపల్ కేంద్రంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమ రాజశేఖర్, సంతోష్, శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, వైద్యాధికారి జువశిక పాల్గొన్నారు.
- గార్ల నెహ్రూసెంటర్‌లో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి రాజ్‌కుమార్‌జాదవ్, జడ్పీటీసీ జాటోలు ఝాన్సీలక్ష్మీబాయి, ఎంపీపీ బట్టు నాగరాజు, దుర్గాప్రసాద్, ప్రవీణ్‌కుమార్, భూక్య నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.
- గంగారంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రత్యూష చిన్నారులకు పోలియోచుక్కలు వేసి, ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డీ సరోజిని పాల్గొన్నారు.
- డోర్నకల్ సీహెచ్‌సీలో మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న చిన్నారులకు పోలియోచుక్కలు వేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు సాద్విజా, సీహెచ్‌వో వీర బాబు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసి పల్స్‌పోలియో కేంద్రాన్ని డీఎంఅండ్ హెచ్‌వో అంబరీష సందర్శించారు.
- నెల్లికుదురులో వైద్యాధికారి వంశీకృష్ణ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఆశావర్కర్లు సావిత్రి, హెచ్ఈవో వేంకటేశ్వర్లు, శ్రీనివాస్, మంగమ్మ, రోజారమణి, స్వరూప, మంజుల పాల్గొన్నారు.
- కేసముద్రంలో ఎంపీపీ ఓలం చంద్రమోహన్ పాల్గొని పోలియో చుక్కలు వేశారు. ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.
- కురవి వీరభద్రస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో బూత్‌లోప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఆలయ చైర్మన్ కోర్ని రవీందర్‌రెడ్డి, బలగాని శ్రీనివాస్, ఈవో సత్యనారాయణ పాల్గొన్నారు. బలపాలలో పల్స్‌పోలియో

మిగతా 6వ పేజీలో

వీరభద్రస్వామి జాతరను సక్సెస్ చేయాలి

ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్



జాతర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జాటోతు రాంచంద్రునాయక్

కురవి, మార్చి 3 : మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈనెల 7 నుంచి జరిగే కురవి వీరభద్రస్వామి జాతరను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. కురవి వీరభద్ర స్వామి దేవాలయంలో ఆదివారం జాతర పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురవి జాతర కోసం ప్రభుత్వ పరంగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని, భక్తులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులు ఎలాంటి అసౌకర్యం కలుగకుండ జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మెంబర్ మాలోతు నెహ్రూనాయక్, అంబటి వీరభద్రం, ఈవో సత్యనారాయణ, కోర్ని రవీందర్, బలగాని శ్రీనివాస్, ఎన్.రాజేందర్‌కుమార్, అవిరె మోహన్‌రావు, రామునాయక్ పాల్గొన్నారు.

వీరభద్రస్వామి దేవాలయ ఉత్సవ కమిటీ ఖరారు



చైర్మన్ రవీందర్‌రెడ్డి

కురవి, మార్చి 3 : కురవి భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి దేవాలయ మహాశివరాత్రి జాతర ఉత్సవ కమిటీ ఖరారైంది. ఈ నెల 7 నుంచి 23 వరకు 16 రోజుల పాటు బ్రహ్మోత్సవాలకు ఉత్సవ కమిటీని దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఉత్తర్వులు విడుదల చేశారు. దేవాలయ చైర్మన్‌గా కోర్ని రవీందర్‌రెడ్డి, ధర్మకర్తలుగా బాలగాని శ్రీనివాస్, కుదురుపాక ఉప్పలయ్య, బండెల సంజీవరెడ్డి, దొంగల జనార్ధన్‌రెడ్డి, భూక్య బక్ష, గడ్డెల బిక్షపతి, చిన్నం గణేష్, ప్రొద్దుటూరి సత్యనారాయణ, భూక్య సక్రు, గుగులోతు సోమ్లు, వెంపటి శ్రీను, తెగుళ్ల వెంకటేష్, కాసుల మల్లికార్జున్‌లను నియమించారు. దేవాదాయశాఖ నుంచి నోటిఫికేషన్ వెలువడ్డాక ఇదే కమిటీ అధికారికంగా కొనసాగనుంది.

గులాబీకి ఝలక్..!

(3వ పేజీ తరవాయి)

సిద్ధమవుతుండడం పార్లమెంట్ ఎన్నికల వేళ గులాబీ పార్టీలో కుదుపుగా రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

క్యూలో మేయర్ సహా 18 మందికి పైగా కార్పొరేటర్లు..

గులాబీ ఏలుబడిలో ఉన్న వరంగల్ మహానగర పాలిక సైతం హస్తగతం కానుంది. ఇప్పటికే ఏడుగురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు గత నెలలో కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. తాజాగా రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు నేతృత్వంలో పలువురు కార్పొరేటర్లు గులాబీ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు హైదరాబాద్‌కు పయనం అయ్యారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కార్పొరేటర్లు హస్తం గూటికి చేరనున్నారు. అయితే పలువురు కార్పొరేటర్లు మంత్రి సురేఖ నేతృత్వంలో కాంగ్రెస్‌లో చేరుతున్న విషయం తెలుసుకున్న మేయర్ గుండు సుధారాణి సైతం తన అనుచర కార్పొరేటర్లతో కలిసి ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని కలిసి కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రతిపాదనలు చేసినట్లుగా సమాచారం. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ నగర పరిధిలోని మంత్రులు, ఎమ్మెల్యేలను మేయర్ చేరికపై చర్చించినట్లుగా సమాచారం. మేయర్ సుధారాణి చేరికపై కార్పొరేటర్ల నుంచి వ్యతిరేకత వస్తే తప్ప మేయర్‌తో పాటు సుమారు 18 మందికి పైగా కార్పొరేటర్లు రెండు, మూడు రోజుల్లో కాంగ్రెస్‌లో చేరే అవకాశాలు కనిపిస్తున్నా యి. మొత్తానికి వరంగల్ మహానగర పాలిక కూడా హస్తం పాలనలోకి రానుంది. ఇది బీఆర్ఎస్‌కు బిగ్ షాక్‌గా రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. కాగా, ఆదివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని మేయర్ సుధారాణి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వరంగల్ నగర అభివృద్ధి కోసమే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసినట్టు తెలి పింది. కానీ, ఆమె త్వరలో కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు ప్రచారం జరుగుతోంది.

హస్తం గూటికి వర్ధన్నపేట చైర్‌పర్సన్..

వర్ధన్నపేట మునిసిపాలిటీ హస్తగతం అయింది. ఇటీవలే బీఆర్ఎస్‌కు చెందిన మునిసిపల్ చైర్‌పర్సన్ అంగోత్ అరుణపై పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. కాగా, ఆదివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు నేతృత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో మునిసిపల్ చైర్‌పర్సన్ అరుణతో పాటు కౌన్సిలర్లు తుమ్మల రవీందర్, మంచాల రామకృష్ణలు కాంగ్రెస్ గూటికి చేరారు. అలాగే వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సైతం కాంగ్రెస్ గూటికి చేరుతారనే ప్రచారం జరుగుతోంది. ఇటీవల సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి వచ్చిన రవీందర్‌రావు పార్టీ మార్పుపై తన అనుచరులతో అంతర్గతంగా చర్చించారు. చాలా మంది కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు మొగ్గు చూపినట్లుగా సమాచారం. అయితే బీఆర్ఎస్ అధిష్ఠానం ఒత్తిడితో చేరిక విషయంలో ఆలస్యం జరుగుతుందని, పార్లమెంట్ ఎన్నికల లోపు రవీందర్‌రావుతో పాటు మరికొంత మంది నేతలు హస్తం గూటికి చేరుతారనే ప్రచారం జరుగుతోంది.

నాల్గవ రోజు మేడారం హుండీల లెక్కింపు

హనుమకొండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మేడారం సమ్మక్క సారలమ్మ జాతర హుండీల లెక్కింపు వరుసగా నాల్గవ రోజు ఆదివారం కూడా ప్రశాంతంగా కొనసాగింది. లెక్కింపులో భాగంగా నాల్గవ రోజు 88 హుండీలను తెరిచారు. వీటి ద్వారా రూ.71,67,000 ఆదాయం సమకూరిందని మేడారం సమ్మక్క సాలరమ్మ జాతర ఈవో రాజేంద్రం తెలిపారు. దీంతో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న హుండీల లెక్కింపు ద్వారా మొత్తం ఆదాయం రూ.10,32,03,000 చేరుకున్నది. ఇప్పటి వరకు 405 హుండీలను లెక్కించడం పూర్తయింది. ఇంకా 113 హుండీలను లెక్కించాల్సి ఉంది. వీటిని సోమవారం లోగా లెక్కిస్తారు. ఆదివారం హుండీల్లో నగదు, నాణాలతో పాటు విదేశీ కరెన్సీ, బంగారం వెండి కానుకలు కూడా బయటపడ్డాయి. వెండి, బంగారు కానుకలను ప్రత్యేక హుండీలో భద్రపరుస్తున్నారు.

ఇక్కడంతా వైవిధ్యమే..

- వీరన్న దేవాలయంలో అరుదైన సంప్రదాయం
- శివరాత్రి నుంచి నెలరోజుల పాటు జనజాతర
- మేడారం తర్వాత భారీగా గిరిజన భక్తుల దర్శనాలు
- ఉమ్మడి రాష్ట్రం నుంచి సీఎంల మొక్కులు.. దర్శనాలు

కురవి వీరభద్రుడికి నారికేళాలు.. భద్రకాళి అమ్మవారికి జంతు బలులు



కురవిలో భద్రకాళి సమేత వీరభద్రుడు

మహబూబాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కోరిన వారికి కోటి వరాలిచ్చే దైవంగా విరాజిల్లుతున్న మహబూబాబాద్ జిల్లా కురవిలోని వీరభద్రస్వామి దేవాలయం వైవిధ్యభరితమైన సంప్రదాయాలతో విలసిల్లుతోంది. భద్రకాళి సమేత వీరభద్రుడిగా భక్తుల కోర్కెలు తీర్చే దైవాలుగా, ఏటేటా మహాశివరాత్రి నుంచి నెల రోజుల పాటు నిర్వహించుకునే జాతర ఉగాది పర్వదినంతో ముగుస్తుంది. ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీవారైనా వీరభద్రుడికి మాత్రం నారికేళ (కొబ్బరికాయ)లు సమర్పించి మొక్కులు తీర్చుకోవడం అనవాయితీ. ఆలయానికి వెలుపల నిర్మించిన ప్రహరీ వెలుపల భద్రకాళి అమ్మవారికి జంతు (కోళ్ల, యాటపోతుల) బలులతో మొక్కులు తీర్చుకోవడం అనాదిగా వస్తోంది. నెలరోజుల పాటు కొనసాగే ఈ జాతరకు రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా తరలివచ్చే భక్తజనం మొక్కులు కూడా వైవిధ్యంగానే ఉంటాయనడానికి ఈ ఆలయమే నిదర్శనం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ముఖ్యమంత్రులుగా కొనసాగిన నారా చంద్రబాబునాయుడు, దివంగత వైఎస్.రాజశేఖర్‌రెడ్డిలతో పాటు తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే బంగారు మీసాలు సమర్పిస్తానని మొక్కుకున్న పూర్వ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఈ ఆలయాన్ని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు విడతల వారీగా మంజూరు చేశారు.

చరిత్ర పుటల్లో కురవి వీరన్న..

ప్రాచీనాంధ్ర చరిత్రలో కాకతీయ ప్రభులది ప్రత్యేక స్థానం ఉందనడంలో అతిశయోక్తి లేదు. కాకతీయుల సామ్రాజ్యం అత్యంత వైభవంగా వెలుగొందిన 12వ శతాబ్దంలో కాకతీయుల కళాపిపాసకు, కళల పోషణ అభిరుచికి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రామప్ప దేవాలయం, వేయి స్తంభాల గుడి, ఇలాంటి దేవాలయాలు నిదర్శనాలుగా నిలుస్తాయి. ఈ కోవలోనిదే.. ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవాలయం. పుణ్యక్షేత్రాలతో విలసిల్లుతూ.. ఈ మండలం చారిత్రక పర్యాటక ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఈ కురవి ఆలయాన్ని దర్శించుకోవడానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు ప్రతీ సంవత్సరం తరలివస్తున్నారు. సికింద్రాబాద్, విజయవాడ రైల్వే సెక్షన్‌లో ఉన్న మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌కు తొమ్మిది కిలోమీటర్ల దూరంలో కురవి ఉంది.

చారిత్రక ప్రాధాన్యంతో కురవి..

కురవి ఒకప్పుడు మహోన్నత దశను అందుకున్న నగరంగా పేరుగడించింది. క్రీ.శ 850 ప్రాంతంలో తూర్పు చాళుక్యులతో ముఖ్యుడైన గునగ విజయాదిత్యుడు వేంగి (ఏలూరు)ను రాజధానిగా చేసుకుని పరిపాలించాడు. వేంగి చాళుక్యుల కాలంలో చోళరాజులతో సత్సంబంధాలు, బంధుత్వాలు ఏర్పడ్డాయని చెబుతారు. ఇందుకు నిదర్శనంగానే రాజరాజ చోళుని కుమార్తెను రాజమహేంద్రవరాన్ని ఏలుతున్న విమలాదిత్యుడు వివాహం చేసుకున్నట్టు చరిత్ర చెబుతోంది. సదరు విమలాదిత్యుడు కుమారుడే రాజరాజ నరేంద్రుడు ఆ కాలంలో తమిళ దేశపు ద్రావిడ సంస్కృతిని ప్రతిబింబించే విశిష్టాద్వైత ప్రబంధాలు వ్యాస భారతాన్ని ఆదికవి నన్నయ్య ఆంధ్రీకరించాడు. ఈ నేపథ్యంలోనే అనేక తెలుగు కుటుంబాలు తమిళ దేశానికి తరలివెళ్లాయి. అప్పట్లోనే వేంగి రాజధానిగా ఆంధ్రదేశాన్ని పరిపాలించే రోజులలో రాష్ట్ర కూటులచే పరాజితుడైన భీమ రాజు ప్రస్తుత ఈ కురవి నగరాన్ని రాజధానిగా చేసుకుని పరిపాలించాడు. ఆ కాలంలోనే శ్రీవీరభద్రేశ్వరి కురవి ఆలయాన్ని నిర్మించినట్లు శిలాశాసనాల ద్వార తెలుస్తోంది. నాటి వేంగి చాళుక్యుల అనంతరం ఈ దేవస్థానాన్ని కాకతీయ తొలి స్వతంత్ర రాజైన 1వ బేతరాజు పునరుద్ధరించారు. తరువాత కాలంలో రెండో బేతరాజు కురవి చెరువును తవ్వించినట్లు అనేక ఆధారాలున్నాయి. తూర్పు చాళుక్య రాజైన శ్రీవీరభద్రుని వివాహమాడిన కాకతీయ సామ్రాజ్ఞి రుద్రమదేవి ఈ కురవి దేవాలయాన్ని సందర్శించినట్లు విదేశీ యాత్రికుడు మార్కోపోలో తన రచనల్లో పేర్కొన్నాడు. శ్రీవీరభద్రుడి దేవాలయం చుట్టూ కురవి పట్టణ ప్రాంతం ఏర్పడినట్లు వేంగి చాళుక్యుల రెండో రాజధాని నగరంగా మహోన్నత శిఖరాలు అధిరోహించి, సాహితీ సాంస్కృతిక రంగాలలో ఎనలేని వైభవాన్ని చవి చూసినట్లు చరిత్ర వల్ల తెలుస్తోంది.

శివరాత్రి నుంచి ఉగాది వరకు..

భద్రకాళి సమేత శ్రీవీరభద్రస్వామి కురవి జాతర ఏటేటా మహాశివరాత్రి రోజున ఆరంభమై నెలరోజుల పాటు కొనసాగి, ఉగాది పర్వదినంతో ముగుస్తుంది. ఈ కాలంలో వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. శివరాత్రి పర్వదినం వెళ్లిన తెల్లవారుజామున శ్రీవీరభద్రేశ్వరుడి కల్యాణం భద్రకాళి అమ్మవారితో జరుగుతుంది. స్వామిని కొలిచే భక్తుల్లో ఎక్కువగా బంజార గిరిజన లంబాడాలే ఉండడం విశేషం. జాతర సందర్భంగా మహబూబాబాద్ జిల్లా అధికార యంత్రాంగం దేవాదాయశాఖ అధికారులు భక్తులకు అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. శివరాత్రికి వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులను నడుపుతుంది.



వీరభద్రుడి సన్నిధిలో నారికేళాలు సమర్పించుకుంటున్న భక్తులు



మహబూబాబాద్ జిల్లా కురవి దేవాలయం

తొలుత స్వామి ఒక్కడే.. ఆపై

కురవిలో తొలుత వీరభద్రస్వామి ఒక్కరే ఉండేవారని, సుమారు 150 ఏళ్ల కిందట భక్తులు తాము చేసిన తప్పొప్పులను ఆలయ ప్రాంగణంలోకి రాగానే వీరభద్రుడే పూనకాల ద్వారా భక్తుడి నోటివెంట నిజాలు చెప్పించేవారని నమ్మకాలు ఉండేవని చెబుతున్నారు. దీంతో అనేక కుటుంబాలు విడిపోవడం లాంటి అనర్థాలు జరిగాయట. ఆ క్రమంలోనే ఉగ్రరూపుడైన వీరభద్రుడి రౌద్రాన్ని తగ్గించడానికి అమ్మవారిని తీసుకురావాలనే ఆలోచన భక్తులకు కలిగిందట! ఫలితంగా భద్రకాళి అమ్మవారి విగ్రహాన్ని తీసుకువచ్చి ఇదే ఆలయంలో వీరభద్రుడి పక్కన ప్రతిష్ఠించారని ప్రతీతి. అప్పట్నుంచి ప్రతీ శివరాత్రి ఈ ఇరువురికి కల్యాణం జరుగుతోంది. అయితే తనకు నారికేళాలు కాదని, బలులు కావాలని, ప్రత్యేక ఆలయం కట్టించాలని ఓ భక్తుడి కలలో అమ్మవారు కన్పించి కోరిందంట.. ఆపై వీరభద్రుడి ఆలయానికి సమీపంలోనే ప్రత్యేకంగా భద్రకాళి ఆలయాన్ని నిర్మించారు. ఈ అమ్మవారు స్వయంభూ అవతారమన్న వాదన కూడా ఉంది. ఏదేమైనా అప్పట్నుంచే ఇటు వీరభద్రుడికి నారికేళాలు సమర్పించుకునే భక్తులు, భద్రకాళి అమ్మవారి ప్రత్యేక ఆలయంలో జంతుబలులు ఇస్తూ వస్తున్నారు.

హక్కుల పోరాట యోధుడు 'నల్లెల'

సంతాప సభలో వక్తల నివాళి

హనుమకొండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమ కారుడు, పర్యావరణ ప్రేమికుడు, పౌర స్పందన వేదిక బాధ్యుడు, దివ్యాంగుల హక్కుల నాయకుడిగా నల్లెల రాజయ్య చేసిన కృషి ఎనలేనిదని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం, ఉమ్మడి వరంగల్ దివ్యాంగ సంస్థల ఆధ్వర్యంలో నల్లెల రాజయ్య సంతాప సభ ఘనంగా జరిగింది. ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బిల్ల మహేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముందుగా రాజయ్య చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. సమాజంలోని ప్రతీ పోరాటంలో, ప్రతీ ఉద్యమంలో మమేకమైన ఒకే వ్యక్తి రాజయ్య అన్నారు. మలిదశ ఉద్యమ పోరాటంలో అందరితో పాటు సమూహమై తిరిగి ఉద్యమంలో వలసదారుల ఆధిపత్యంపై నిప్పులు కురిపించారన్నారు. వరంగల్ రచయితల సంఘాన్ని ఏర్పాటు చేసి ఆ సంస్థ ద్వారా అనేక పోరాటాలను నడిపించడంతో పాటు 20కిపైగా సంఘాలతో సాహిత్య సంపదను తీసుకువచ్చారన్నారు. దివ్యాంగుల హక్కులపై నిరంతరం గొంతెత్తాడని, దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకుడిగా అనేక విధాలుగా పోరాటాలు కొనసాగించాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్, ఆర్ట్స్ కళాశాల ప్రొఫెసర్ బన్నా ఐలయ్య, ది వ్యాంగ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే హబీబ్ మియా, లక్ష్మయ్య, బోనగిరి రాములు, డాక్టర్ లక్కిరె డ్డి సత్యం, శంకర్ నాయక్, తిరుపతి, పొట్లపల్లి శ్రీనివాసరావు, అనిశెట్టి రజిత, రామలక్ష్మి, డబ్ల్యూవో కె మధురిమ, మెప్మా ఎండీ అంబటి రాజేందర్, ఎన్‌టీడీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అజీమ్, పౌర స్పందన వేదిక అధ్యక్షుడు కె శంకర్‌రావు, పింగిళి కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్యామల, తెరవే రాష్ట్ర కార్యదర్శి జోగు అంజయ్య, ఆత్మకూరి రామకృష్ణ, వల్లపురెడ్డి వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నల్లెల రాజయ్యకు నివాళులర్పిస్తున్న ప్రముఖులు

అలరించిన డాగ్ షో



కాళోజీ జంక్షన్, మార్చి 3 : కాకతీయ కెన్నెల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని సెయింట్ పీటర్స్ పాఠశాలలో నిర్వహించిన అంతర్జాతీయ డాగ్ షో చూపరులను ఎంతగానో అలరించింది. డాగ్ షోలో తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 35 రకాల జాతులకు చెందిన శునకాలను డాగ్ షోలో ప్రదర్శించడానికి తీసుకొచ్చారు. పది రౌండ్లు నిర్వహించిన పోటీల్లో శునకాలు, వాటి యజమానులు ఉత్సాహంగా ఉల్లాసంగా పాల్గొన్నారు. వరంగల్ నగరం నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్నాయి. బహుమతులు గెలుచుకున్న శునకాలకు నిర్వాహకులు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. డాగ్ షో నిర్వాహ కులు వి.రమణారెడ్డి, కె.రామస్వామి, డాక్టర్ ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.



కొలువుదీరిన దామేశ్వరుడు

ఘనంగా శివలింగ ప్రతిష్ఠాపనోత్సవం

దామెర, మార్చి 3: దామెర మండల కేంద్రంలో ప్రాచీన శివాలయం(దామేశ్వరాలయం)లో మూడు రోజుల పాటు నిర్వహించిన పునఃప్రతిష్ఠాపనోత్సవాలు వైభవోపేతంగా జరిపించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో వేద పండితుల వేద మంత్రాల నడుమ పూర్ణాహుతి క్రతువును పూర్తి చేశారు. గన్నవరం భువనేశ్వరీ పీఠాధీశ్వరులు కమలానంద భారతీ స్వామి అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా జరిగిన పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవంలో అమ్మవార్లకు మంగళసూత్రంతో పాటు మెట్టెలను కోట రాంరెడ్డి దంపతులు బహూకరించారు. ఈ సందర్భంగా శివం టెంపుల్ ట్రస్ట్ చైర్మన్ బిల్లా రమణారెడ్డి దంపతులు, ముద్దసాని సహోదర్‌రెడ్డి, చందుపట్ల సత్యవర్ధన్‌రెడ్డి, గంగిడి శ్రీధర్‌రెడ్డి, పోలం కృపాకర్‌రెడ్డి, గురిజాల శ్రీరాంరెడ్డి, పోల్సాని అనిల్‌రెడ్డి, వద్దిరాజు సత్యనారాయణరెడ్డి, గరిగె కల్పనకృష్ణమూర్తి, దామెరుప్పుల శంకర్, మేరుగు కుమారస్వామి, గడ్డం సదానందం, గంగిడి రాజేందర్‌రెడ్డి, సండెసారి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



యాగశాలలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

దర్శించుకున్న పలువురు ప్రముఖులు

దామేశ్వరాలయం(శివాలయం)లో ఆదివారం శివలింగ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు ఎంతో వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా స్వామివారికి యాగశాలలో నిర్వహించిన ప్రత్యేక పూజాధికాల్లో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన వెంట దామెర మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మన్నెం ప్రకాశ్‌రెడ్డి, సీనియర్ జిల్లా నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పోలెపాక శ్రీనివాస్, సదిరం పోచయ్య, హింగె నాగేశ్వర్‌రావు, దురిశెట్టి భిక్షపతి, శనిగరం సుధాకర్, నల్ల సుధాకర్ ఉన్నారు. పునఃప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించినవారిలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, బీజేపీ జాతీయ నాయకుడు వంగాల సమ్మిరెడ్డి, రాష్ట్ర నాయకులు మంద ఐలయ్య, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సతీమణి నీలిమ, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్(డీడీవోపీ) సత్యనారాయణ, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ మల్లాడి శ్రీరాంరెడ్డి, సంఘ్ సంచాలక్ పోల్సాని శ్రీనివా స్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాదులు వద్దిరాజు వెంకటేశ్వర్‌రావు, గణేష్, లంక రాజారాంరెడ్డి హాజరయ్యారు.

నాటక రంగాన్ని బతికించాలి..

టీవీ, సినిమా మోజులో పడిన జనం..

డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

ఘనంగా ప్రారంభమైన నాటక పోటీలు

వర్ధన్నపేట, మార్చి 3 : భారతీయ సాంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించి, నాటక రంగంగాన్ని బతికించి, భావితరాలకు అందించాల్సిన గురుతర బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని వరంగల్ నగర మాజీ మేయర్, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. ఆదివారం రాత్రి వర్ధన్నపేటలో భారతీయ నాటక కళాసమితి ఆధ్వర్యంలో 50వ ఉభయ రాష్ట్రాల ఆహ్వాన నాటక పోటీల ప్రారంభోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కళాసమితి అధ్యక్షుడు గాడిపెల్లి రాజేశ్వర్‌రావు అధ్యక్షత జరిగిన వేడుకల్లో ముఖ్యఅతిథి స్వర్ణ మాట్లాడుతూ పూర్వం నాటికలకు ఆదరణ లభించేందని, ప్రస్తుతం సినిమాలు, టీవీ మోజులో పడి నాటక రంగాన్ని పట్టించుకోవడం లేదన్నారు. సామాజిక రుగ్మతలు, సాంఘిక దురాచారాలను రూపుమాపేలా ఇతివృత్తాలను ప్రోత్సహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావానికి అహర్నిశలను కృషి చేస్తున్న భారతీయ కళాసమితి సేవలు ప్రశంసనీయమన్నారు. అంచెలంచెలుగా ఎదిగి స్వర్ణోత్సవాలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. నాటక రంగాన్ని ప్రోత్సహించడానికి ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని కోరారు. ఎంపీపీ అప్పారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో అంచెలంచెలుగా ఎదిగి 50వ ఉభయ రాష్ట్రాల పరిధిలో నాటికలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కళలను ప్రోత్సహించి విదేవీ సంస్కృతిని పారద్రోలాల్సిన అవసరం ఉందన్నారు. నాటక ప్రారంభోత్సవానికి ముందు చిన్నారులు ప్రదర్శించిన నృత్యం అందరిని ఎంతగానో అలరించింది.

పట్టణంలో శోభాయాత్ర..

వర్ధన్నపేట పట్టణంలో ఆదివారం రాత్రి భారతీయ నాటక కళాసమితి ఆధ్వర్యంలో ఉభయ రాష్ట్రాల నాటపోటీలను పురస్కరించుకొని ఆదివారం రాత్రి అంబేద్కర్ సెంటర్ నుంచి నాటక కళా సమితి వరకు కళాకారులతో శోభయాత్ర నిర్వహించారు. శోభయాత్ర అందరిని అలరింపజేసింది. అనంతరం భారతీయ నాటక కళా సమితి ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటక పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.



నాటకోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ

ఆకట్టుకున్న నాటికలు..

తొలి రోజు ఆదివారం రెండు నాటక ప్రదర్శనలు నిర్వహించగా ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మొదట తెలుగు కళా సమితి విశాఖపట్టణం వారి నిశ్శబ్దమా- నీ ఖరీదెంత నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకంలో.. అనాదిగా కుటుంబ వ్యవస్థను మెరుగుపరుద్దామని చట్టంలో కొన్ని మార్పులు చేస్తున్నారు. ఆ మార్పులు, కష్టాలను, కన్నీళ్లను అనుభవిస్తున్న వాళ్లకు ఎంత వరకు ఉపశమనం కలిగిస్తుందో తెలియదుగానీ కొందరు ఇచ్చిన తప్పుడు రిపోర్టు కారణంగా కత్తి కన్నా పదునైన చట్టాన్ని దుర్వినియోగపర్చడం జరుగుతోందని ఈ నటకంలో కళ్లకు కట్టినట్టు రక్తికట్టించారు. వామన్‌రావుగా జి.కన్నబాబు, కుమార్‌గా వరప్రసాద్, పల్లవిగా డి.హేమ, ఎస్‌ఐ పాపారావుగా బీవీ.ప్రసాద్‌రావు, హెడ్ కానిస్టేబుల్ వెంకటరావుగా ఇ.రాంబాబు, అనూరాధగా లాస్య తమ పాత్రలకు తమ అద్భుత నటనతో ఆకట్టుకున్నారు.

రెండో నాటిక కళానికేతన్ వీరన్నపాలెం వారు ప్రదర్శించిన రాజు గారి గోచి నాటకం విశేషంగా ఆకట్టుకుంది. కథలోకి వెళ్తే.. ఓ చిన్న దీవి. జనాభా కేవలం ఆరువేలు. వారి నుంచి పన్నులు పిండే పాలకులు సరదాలకు చాలక పేదల శ్రమని దోచుకునేందుకు జూదశాలను ఏర్పాటు చేస్తారు. దాని వల్ల ఓ హత్య జరుగుతుంది. హంతకుడికి రాజు ఉరి శిక్ష వేస్తాడు. ఉరిని అమలు చేయలేక దానిని జైలుశిక్షగా మారుస్తారు. వాడికి ముమ్మారు భోజనం, కాపల భటుడు, ఆ చిన్న ఆర్థిక వ్యవస్థకు పెనుభారంగా మారుతుంది. అంతర్లీనంగా రాజుని, పాలనను ఎలాగైన దారినపెట్టేందుకు చేసే ప్రయత్నమే ఈ కథ. నేర విచారణ, నేరస్తుడికి శిక్ష కంటే కూడా నేరం వల్ల అనాథలైన బాధితుల్ని ఆదుకోవడం ముఖ్యమని చెప్పడమే ఈ నాటకం ఉద్దేశం. పాత్రధారులు తమ పరిధి మేరకు చక్కగా నటించి విశేషంగా ఆకట్టుకున్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదు

● మానుకోట డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ రూరల్, మార్చి 3 : మహబూబాబాద్ డివిజన్‌లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని మానుకోట డీఎస్పీ తిరుపతిరావు హెచ్చరించారు. మానుకోట టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడవద్దని సూచించారు. రౌడీషీటర్లు గొడవలు, అల్లర్లలో పాల్గొనవద్దన్నారు. కార్యక్రమంలో టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సైలు పవన్‌కుమార్, అరుణ, శివ పాల్గొన్నారు.



మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

గాయపడిన గీత కార్మికుడు మృతి

డోర్నకల్, మార్చి 3 : తాటిచెట్టుపై నుంచి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందిన ఘటన పెరుమాండ్ల సంకీసలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ బంధం ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన మామిండ్ల లక్ష్మీనారాయణ (38) తాటిచెట్లు ఎక్కి కల్లుతీసి విక్రయించి కుటుంబాన్ని పోషించుకునే వాడు, ఈ క్రమంలో గత ఏడాది నవంబర్ 23న లక్ష్మీనారాయణ తాటిచెట్టు ఎక్కుతుండగా జారికిందపడ్డాడు. ఈ ఘటనలో ఆయనకు తీవ్రగాయాలు కాగా, కుటుంబసభ్యులు ఆయనను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సనందిస్తున్నారు. ఆదివారం లక్ష్మీనారాయణ ఆరోగ్యం క్షీణించి మృతి చెందినట్లు సీఐతెలిపారు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి తండ్రి లాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గిరిజనుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

● ప్రభుత్వవిప్ జాటోతు, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్

నెహ్రూసెంటర్, మార్చి 3 : మహబూబాబాద్ జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యుడు జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో బాలాజీ గార్డెన్స్‌లో ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో గిరిజన ప్రజా ప్రతినిధుల సన్మానసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలనలో గిరిజనులు అనేక ఇబ్బందులు పడ్డారని, తక్షణమే ఈ జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్నసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రజలందరి కష్టాలు తొలగిపోతాయని స్పష్టం చేశారు. అనంతరం ఇటీవల ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మెంబర్ మాలోతు నెహ్రూనాయక్, డాక్టర్ లక్ష్మీనారాయణ, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసునాయక్, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుగులోతు రాములునాయక్, ఏక్‌మత్రో అధ్యక్షుడు వాంకుడోతు మంగీలాల్‌నాయక్, కౌన్సిలర్ భూక్య శ్రీను పాల్గొన్నారు.



సభలో అభివాదం చేస్తున్న గిరిజన ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు

ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తాం

● మరిపెడ : కాంగ్రెస్ ప్రభుత్వం పక్కాగా ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేసి తీరుతుందని డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. మరిపెడలోని 5వ వార్డుకు చెందిన పలువురు గృహవిద్యుత్ వినియోగదారులకు ఎలక్ట్రిసిటి జీరో బిల్లులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంచంద్రునాయక్ లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం, నిరుపేదలకు మెరుగైన వైద్యం అందివ్వడానికి రూ.10 లక్షల ఆరోగ్య బీమా అమలు చేస్తున్నారన్నారు. ఇక ఈనెల 11వతేదీ నుంచి ఇందిరమ్మ ఇళ్ల మంజూరికి సీఎం రేవంత్‌రెడ్డి కార్యాచరణ చేపట్టారన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో మరిపెడ ఏడీఈ లోక్‌నాథ్‌రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎస్కే.అఫ్జల్, తాజుద్దీన్, అప్సర్, గుండగాని వెంకన్న, లైన్ఇన్‌స్పెక్టర్ మాలు పాల్గొన్నారు.

● కురవి : ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన విధంగా ఆరు గ్యారెంటీలను తప్పక అమలు చేస్తామని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. కురవిలోని గ్రామపంచాయతీలో గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత కరెంట్ పథకాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోని లబ్ధిదారులు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈ విజయ్, ఏడీఈ రమేష్, ఏఏవో లావణ్య, ఏఈ శారద పాల్గొన్నారు.



కేసముద్రం విలేజిలో 2004-05 టెన్త్‌క్లాస్ పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కేసముద్రం, మార్చి 3 : కేసముద్రం విలేజి జడ్పీహైస్కూల్లో ఆదివారం 2004-05 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 20ఏళ్ల అనంతరం కలుసుకున్న స్నేహితులు అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ, ప్రస్తుత హెచ్ఎంలు మారంరాజు నారాయణరావు, కొత్త జగన్మోహన్‌రెడ్డిలు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తాము చేస్తున్న వృత్తిలో నైపుణ్యాలు పెంచుకుంటే అభివృద్ధి సాధించవచ్చని అన్నారు. హెచ్ఎంలతోపాటు ఉపాధ్యాయులు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, పుష్పలీల సూర్యప్రకాశ్, బండి లక్ష్మయ్యను శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎలగలబోయిన అనీల్, కోడి సురేష్, ఎండీ.జాని, మర్రిపెల్లి లెనిన్, బొమ్మరబోయిన సతీష్, చిలుముల మహేష్, నాగెల్లి రంజిత్, కీర్తి నవీన్, ఎండీ.అమీర్, నర్మద, కల్పన, మమత, రజిత, శ్రీలత, లావణ్య పాల్గొన్నారు.

జిల్లా ఉద్యానవన శాఖ అధికారికి సన్మానం

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 3 : ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖ అధికారిగా పనిచేసిన కె.సూర్యనారాయణను ఆశాఖ ఉద్యోగులు, రైతులు ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్లో ఆదివారంఆత్మీయ వీడ్కోలు సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, వివిధ మండలాల్లో పనిచేస్తున్న ఉద్యానవన శాఖ అధికారులు మాట్లాడారు. జిల్లాలో ఉద్యానవన రంగానికి అనేక ఏళ్లుగా అత్యుత్తమ సేవలందించారని, జిల్లాలో ఆయిల్‌పామ్ తోటల పెంపకాన్ని అభివృద్ధి చేశారని సూర్యానారాయణను కొనియాడారు. విష్ణు, అనితశ్రీ, రాకేష్‌తో పాటు రైతులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'మహిళా దినోత్సవ సభను జయప్రదం చేయండి'

మహబూబాబాద్ టౌన్, మార్చి3 : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ఆధ్వర్యంలో ఈనెల 7న నిర్వహించే మహిళా దినోత్సవ సభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిండ్ల సాంబలక్ష్మి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ వీరభవన్‌లో ఆదివారం సంఘం పట్టణ సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబలక్ష్మి మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయనివాటిని అరికట్టాలని కోరారు. ఎర్రోజు పద్మ, ఎండీ. అలీమా, తండా మాధవి, రాణి, ఉమా, పద్మ పాల్గొన్నారు.

● మహబూబాబాద్ రూరల్ : అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 7 నిర్వహించే వేడుకలకు మహిళలు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ప్రగతిశీల మహిళ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుజ్జు కృష్ణవేణి, ఊకె. పద్మ పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో ఆదివారం అంతర్జాతీయ మహిళ దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ప్రతీ సంవత్సరం మార్చి 8 జరుపుకోవడం జరుగుతుందన్నారు. మహిళలపై జరుగుతున్న శ్రమదోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో భట్టు భిన్నమ్మ, పొన్నం రమ, శివ్వారపు శారద, పూలమ్మ, శైలజా, పద్మ పాల్గొన్నారు.



అంతర్జాతీయ మహిళ దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీవోడబ్ల్యూ నేతలు

కాంగ్రెస్ పాలనలోనే పేదలకు ప్రాధాన్యత

● మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం, మార్చి 3 : కాంగ్రెస్ పాలనలోనే పేదలకు ప్రాధాన్యతనిస్తూ పథకాలను రూపొందించి అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో ఆదివారం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ గెలుపు కోసం కష్టపడిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, బండారు దయాకర్, వెంకన్న, పొలెపల్లి వెంకట్‌రెడ్డి, పొలెపాక నాగరాజు, చిదిరాల వసంతరావు, నూకల వెంకటేశ్వర్లు, మెట్టు రవీందర్, అరిగె విజేందర్, కట్ల పాపయ్య, పబ్బతి సారంగం, అడప రమేష్ పాల్గొన్నారు.

అధికారుల అండదండలతో ఇసుక అక్రమ రవాణా

● సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ కమిటీ సభ్యుడు ఎడ్ల మల్లయ్య

చిన్నగూడూరు, మార్చి 3 : అధికారుల అండదండలతో ఇసుక అక్రమ రవాణా సాగుతుందని సీపీఎంఎల్ న్యూ డెమోక్రసీ కమిటీ సభ్యుడు ఎడ్ల మల్లయ్య ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఉగ్గంపల్లిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. ఇసుక వ్యాపారస్తులు అధికారుల కనుసన్నలలో ఇసుక రవాణా చేస్తూ రేట్లు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్నారని అన్నారు. సామాన్యుల ఇంటి నిర్మాణానికి ఇసుక కావాలంటే పర్మిషన్ కావాలి కానీ, ఇసుక వ్యాపారులకు అధికారులతో ఒప్పందం ఉంటే చాలని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. సొంతఇల్లు నిర్మించుకునే ప్రతీ ఒక్కరికీ ఇసుక రవాణాకు మండల అధికారులు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అక్రమ వ్యాపారస్తులకు సహకరించే అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కొంపెల్లి రాంమూర్తి, గుండాల అజయ్, కరుణాకర్, వెంకన్న ఉన్నారు.

ఎమ్మెల్యే కోరంకు సీపీఎం వినతి

గార్ల, మార్చి 3 : మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో సిబ్బంది కొరతను భర్తీ చేయాలని కోరుతూ.. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సిబ్బంది లేకపోవడంతో వైద్యం అందక రోగులు ఇబ్బందులుపడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఆస్పత్రిలో సిబ్బందిని కేటాయించి రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హరినాయక్, వంగూరి వెంకటేశ్వర్లు, కవిత, సత్యవతి పాల్గొన్నారు.

దడువాయిలను స్కిల్ వర్కర్లుగా గుర్తించాలి

● దడువాయిసంఘం రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి3 : రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్‌లలో పనిచేసే దడువాయిలను కార్మికులుగా, స్కిల్ వర్కర్లుగా గుర్తించి నాల్గవ తరగతి ఉద్యోగులుగా నియమించాలని తెలంగాణ దడువాయి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సరసాని సురేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఆదివారం ఆ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో అమలవుతున్న లైసెన్స్ విధానం వల్ల మార్కెట్ కార్మికులు కాకుండా మిగిలిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో దడువాయిలకు ఎటువంటి కార్మిక చట్టం వర్తించడం లేదన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూనావత్ రవికుమార్, వరంగల్ మార్కెట్ దడువాయి సంఘం అధ్యక్షుడు దేవేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి అశోక్, దస్రు, మంగీలాల్ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి ఆపరేషన్ థియేటర్‌లో జన్మదిన వేడుకలు

● సోషల్ మీడియాలో వీడియోలు వైరల్

తొర్రూరు, మార్చి 3 : తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యాధికారి జన్మదిన వేడుకలను డీజే పాటలతో నిర్వహించడంతో సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ అయ్యాయి. శనివారం రాత్రి తొర్రూరు ప్రభుత్వ క్లస్టర్ వైద్యాధికారి మురళీధర్ రావు జన్మదిన వేడుకలను ఆస్పత్రి భవనానికి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లో కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. ఆస్పత్రి ఆవరణలో విందు భోజనాలు ఏర్పాటు చేసుకుని డీజే పాటలతో ఉత్సాహంగా గడిపారు. దీంతో ఈ జన్మదిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పేద ప్రజలకు వైద్యసేవలు అందించాల్సిన వైద్యులు, వైద్య సిబ్బంది ఆస్పత్రి ఆవరణలో వేడుకలు నిర్వహించుకోవడం ఏమిటని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. దీనిపై వైద్యాధికారి మురళీధర్ రావును వివరణ కోరగా ఆస్పత్రి ఆవరణలో క్లస్టర్ మీటింగ్ నిర్వహించగా సిబ్బంది తన జన్మదినాన్ని తెలుసుకుని వేడుకలు చేశారన్నారు.

మందకృష్ణ మాదిగ పర్యటనను సక్సెస్ చేయాలి

మరిపెడ, మార్చి3 : మంద కృష్ణమాదిగ మహబూబాబాద్ జిల్లా పర్యటన ఈనెల 7న ఉందని, జిల్లాలోని ఎమ్మార్పీఎస్, ఎంపీఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకొని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి దుప్పెల్లి అనిల్‌కుమార్‌మాదిగ పిలుపు నిచ్చారు. ఆదివారం ఆయన మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవన్‌లో స్థానిక ఎమ్మార్పీఎస్ నేతలతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి,మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు శాగంటి రమేశ్, కార్యదర్శి ఇరుగు రవి, స్థానిక నాయకులు భాషిపంగు రవికాంత్, రమేశ్, తప్పెట్ల విజయ్ పాల్గొన్నారు.

ఇదిగిదిగో 'జీరో' బిల్లు..

● గృహజ్యోతి రాయితీ కింద చెల్లింపు

కేసముద్రం, మార్చి3 : రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గృహజ్యోతి రాయితీకింద 'జీరో' బిల్లులను కేసముద్రం ఆదివారం నుంచి జారీ చేస్తున్నారు. సాధారణ బిల్లులాగే ఉండగా'బిల్లు అమౌంట్ కింద 'గృహ జ్యోతి సబ్సిడీ'గా పేర్కొని బిల్లు డబ్బులను మైనస్ చేస్తూ వినియోగదారుడు చెల్లించాల్సిన 'నెట్‌బిల్ అమౌంట్ వద్ద 'జీరో' చూపుతోంది. గతనెల వరకు బిల్లులు చెల్లించిన గృహ వినియోగదారులు ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరంలేని 'జీరో' బిల్లు చూసి సంబరంలో మునిగి తేలుతున్నారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

మహబూబాబాద్ రూరల్, మార్చి 3 : జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీ సమీపంలో పేద ముస్లిం మహిళలకు 20 కుట్టు మిషన్లు, రెండు తోపుడు బండ్లను ఇలియాజ్ మహమ్మద్ ఉస్మాన్ అందించారు. ఈ సందర్భంగా ఉస్మాన్ మాట్లాడుతూ మిన్‌హాజ్ టైలరింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్‌లో శిక్షణ ఇచ్చి అనంతరం వారికి కుట్టుమిషన్లు, చిరు వ్యాపారం చేసుకునేందుకు రెండు తోపుడుబండ్లను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మతపెద్దలు మౌలానా అబ్దుల్ లతీఫ్ రషీద్, ముఫ్తీ అబ్దుల్ కరీం, ముఫ్తీ అలంగీర్, షేక్ యూసుఫ్, జిల్లా కోఆప్షన్ సభ్యులు మహబూబ్‌పాషా, మునిసిపల్ కోఆప్షన్ సభ్యులు ఇస్మాయిల్, అబ్దుల్ ఇమ్రాన్, షేక్.ఖాదర్‌బాబా, మహ్మద్ సలీం పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ టికెట్‌ను ఎరుకలకు కేటాయించాలి

కేసముద్రం, మార్చి 3 : మహబూబాబాద్ ఎంపీ టికెట్‌ను కాంగ్రెస్ పార్టీ తరఫున ఎరుకల కులస్తుడనైన తనకే ఇవ్వాలని జాతీయ ఎరుకుల సంఘం చైర్మన్ రాయపురం సాంబయ్య కోరారు. మండలంలోని ఉప్పరపల్లి ముత్యాలమ్మగుడిలో ఆదివారం ఎమ్మెల్యే మురళీనాయక్ గెలుపుపట్ల హర్షం వ్యక్తం చేస్తూ పూజలునిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గత మూడు అసెంబ్లీ ఎన్నికల్లో తాను టికెట్ అడిగానని, అవకాశం ఇవ్వకపోయినా పార్టీ గెలుపు కోసం కృషి చేశానని తెలిపారు. గతంలో ఎంపీగా పనిచేసిన వారికి టికెట్ ఇస్తే ప్రజల్లో వ్యతిరేకత ఉందని, కొత్తవారికి అవగాహన కల్పించాలని కోరారు. కట్ల పాపయ్య కేతిరి ఉపేందర్, రాగం మల్లయ్య, కట్ల వెంకన్న, మల్లేష్, ఎల్లేష్, రాజేష్, గుతుల ఉప్పలయ్య ఉన్నారు.

చిన్నారి అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

కేసముద్రం, మార్చి 3 : అర్పనపల్లిలో రక్తానికి సంబంధించిన హిమోఫిలియాతో మృతి చెందిన చిన్నారి ప్రిన్సి అంత్యక్రియలకు రూ.5వేలను మృతురాలి కుటుంబానికి సమ్మిగౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారి తండ్రి బత్తుల నరేష్‌ను పరామర్శించి ఓదార్చారు. మాజీ సర్పంచ్ గంధసిరి వెంకన్న, సోమన్న, రాజేష్, యాకన్న, మోడెం రాజు, గంధం భరత్, కందాల రమేష్, చీర వెంకన్న, కుమార్, యాదగిరి పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలకు

గూడూరు, మార్చి 3 : చదువుకు పేదరికం అడ్డుకాదని, పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చుని, ఇందుకు ఉదాహరణే మిట్ట అనిల్‌రెడ్డి ఒక్కరు మారిన చాలు వ్యవస్థాపకుడు వాంకుడోతు గోపినాథ్ అన్నారు. గూడూరు మండల కేంద్రం చంద్రుగూడెంకు చెందిన మిట్ట అనిల్‌రెడ్డి గురుకుల బోర్డు ప్రకటించిన ఫలితాల్లో టీజీటీ ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా ఎంపికైన సందర్భంగా ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా గోపినాథ్ మాట్లాడుతూ.. అనిల్‌రెడ్డి నిరుపేద కుటుంబానికి చెందిన వాడని, పట్టుదలతో చదివి నేడు ప్రభుత్వ ఉద్యోగం పొందాడని అయన్ను అభినందించారు. అనిల్‌రెడ్డిని ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకుని చదువులో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బానోత్ లక్ష్మణ్‌నాయక్, వీరన్ననాయక్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు, మార్చి 3 : లయన్స్ క్లబ్ సభ్యులు, ప్రతినిధులు ఈ ప్రాంత ప్రజలకు చేస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి కొనియాడారు. ఆదివారం తొర్రూరులోని బృందావన్ ఎస్టేట్‌లో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రాంతీయ సమ్మేళనానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. లయన్స్ క్లబ్ సభ్యులు పురుషులే కాకుండా మహిళలు కూడా సేవా తరుణి గ్రూప్‌గా ఏర్పడి సేవలు అందించడం ఎంతో గొప్ప విషయమన్నారు. సమాజంలో అట్టడుగున ఉన్న పేద ప్రజల కోసం నిత్యవసర సరుకుల పంపిణీ, అన్నదానం, రైతులకు అవసరమయ్యే యంత్రాలు,పనిముట్లు, వీధి వ్యాపారులకు గొడుగులతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు కల్పించడం అభినందనీయమన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న వ్యాపారస్తులు, ఉన్నతవర్గాల వారు సేవ చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమని, గత 30 సంవత్సరాల క్రితం తొర్రూరు ప్రాంతంలో లయన్స్ క్లబ్‌ను నెలకొల్పి చార్టర్డ్ సభ్యులుగా సేవలు అందిస్తున్నారని, అనంతరం సభకు హాజరైన ఎమ్మెల్యేను, ముఖ్యఅతిథులను శాలువా, మెమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ డాక్టర్ వి.శారద, డిస్ట్రిక్ గవర్నర్ ఎస్.వెంకటేశ్వర్ రావు, పాస్ట్ గవర్నర్ కన్నా పరశరాములు, కె.వెంకట్‌రెడ్డి, కె.రాజేందర్ రెడ్డి, లక్ష్మీనర్సింహారావు, డాక్టర్ ఎస్.నాగవాణి, విశ్వేశ్వరరావు, వి.శైలజ, శ్రీదేవిరెడ్డి, సోమ రజిని, క్లబ్‌సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యశస్విని రెడ్డి

మద్యం మత్తులో యువకుల వీరంగం

దంతాలపల్లి, మార్చి3 : మద్యం మత్తులో గుర్తు తెలియని యువకులు బిర్యానీ సెంటర్‌పై దాడిచేసి నేషనల్ హైవేపై హల్‌చల్ చేశారు. మండల కేంద్రంలోని హైవేపై యువకులు వీరంగం చేస్తున్నట్లు వార్త దావణంలా వ్యాపించడంతో సంఘటనాస్థలికి స్థానిక ఎస్సై కరుణాకర్ చేరుకున్నారు. మద్యం మత్తులో ఉన్న యువకులను చెదరగొట్టే ప్రయత్నంలో యువకులు పోలీసులపై తిరగబడ్డారు. మరికొందరు ఎస్సై కరుణాకర్‌పై దాడికి యత్నించారు. దీంతో పోలీసులు లాఠీచార్జి చేయాల్సిన దుస్థితి నెలకొంది. వీరంగం సృష్టిస్తున్న యువకులను పెట్రోలింగ్ వాహనంలో తరలించారు. దీంతో గంటపాటు హైవేపై గందరగోళం నెలకొంది. యువకులు పోలీసుల మధ్య తోపులాట జరుగుతున్నట్లు సమాచారం వాట్సాప్‌లో వైరల్ కావడంతో సంఘటనాస్థలికి నర్సింహులపేట పోలీసులు చేరుకొని మద్యం మత్తులో ఉన్న యువకులను ఆధీనంలోకి తీసుకున్నారు. తొర్రూరు సురేష్ జరిగిన సంఘటనపై విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

కాగా, స్థానిక ఎస్సై కరుణాకర్‌ను వివరణ కోరగా మండల కేంద్రంలోని నేషనల్ హైవేపై ఉన్న బిర్యానీ సెంటర్ వద్ద యువకులు ఘర్షణ పడుతుండడంతో సమాచారం మేరకు వెళ్లామన్నారు. ఈ క్రమంలో యువకులు బిర్యానీ సెంటర్‌పై దాడికి యత్నించారన్నారు.



యువకులను చెదరగొడుతున్న పోలీసులు

కాంగ్రెస్ పార్టీ నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

● తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్

గూడూరు, మార్చి 3 : మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి లంబాడ సామాజిక వర్గానికి చెందిన పోరిక బలరాం నాయక్‌కు టికెట్ ఇవ్వడం తగదని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్ డిమాండ్ చేశారు. గూడూరు మండల కేంద్రంలో ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పోరిక బలరాంనాయక్‌కు మహబూబాబాద్ ఎంపీ టికెట్ కేటాయించినట్లు సోషల్ మీడియాలో కథనాలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ వార్తను ఆదివాసీ సమాజం ముక్తకంఠంతో వ్యతిరేకిస్తుందన్నారు. మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం 2009లో ఏర్పడిన నాటి నుంచి బలరాంనాయక్ 2009, 2014, 2019లో లోక్‌సభ తరుపున పోటీ చేశారని పేర్కొన్నారు.

మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లు ఉన్నాయని, అందులో నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్‌లలో ఆదివాసీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు ఉన్నారని సుధాకర్ పేర్కొన్నారు. 6 లక్షల మంది పైచిలుకు ఆదివాసీ జనాభా ఉందని, కాంగ్రెస్ పార్టీ నుంచి ఆదివాసీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తికే అభ్యర్థిత్వం ఖరారు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు పడిగె నాగేశ్వర్‌రావు, బొల్లి సారయ్య, లింగాల కిరణ్‌కుమార్, కత్తుల నగేష్ పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

పల్స్ పోలియో విజయవంతం

(3వ పేజీ తరువాయి)

సెంటర్ వద్ద డీఎంఅండ్‌హెచ్‌వో అంబరీష చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో కృష్ణార్జున్‌రావు, వడ్డెబోయిన శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్లు స్రవంతి, డాక్టర్ విరాజిత పాల్గొన్నారు.

గూడూరులో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని జడ్పీ కోఆప్షన్ సభ్యులు మహ్మద్ ఖాసీం చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. మారుమూల ఏజెన్సీ గ్రామమైన మట్టెవాడ శివారు దొరవారితిమ్మాపురం, నెలవంచ గ్రామాలకు అయోధ్యపురం వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది కాలినడకన వెళ్లి పోలియోచుక్కలు వేశారు. సిబ్బంది సీతమ్మ, లోక్యానాయక్, గణేష్, హేమలత, అరుణమ్మ, సర్దార్‌బాబు, కృష్ణ పాల్గొన్నారు.